వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 307 శనివారం | 22 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

# రెండు రోజులు నీటి సరఫరా బంద్

**దేశాయిపేట ఫిల్టర్ బెడ్ పరిధిలో పైపు లైన్ మరమ్మతు పనులు**



వరంగల్ దేశాయిపేట ప్రతాప రుద్ర ఫిల్టర్ బెడ్ పరిధిలో పైపు లైన్ మరమత్తు పనులు కొనసాగుతున్నందున రెండు రోజులు (సోమ, మంగళ వారం) నీటి సరఫరా ఉండదని అట్టి ఫిల్టర్ బెడ్ పరిధిలోని ప్రాంత ప్రజలు సహకరించాలని బల్దియా ఈఈ శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో కోరారు. ఫిల్టర్ బెడ్ పరిధిలోని ప్రాంతాలైన దేశాయిపేట, కొత్తవాడ, ఆటో నగర్, పోచమ్మ మైదాన్, ఎల్ బి నగర్, కాశీబుగ్గ, కంటి హాస్పిటల్, ఎంజీఎం ఆసుపత్రి ఏరియా, కేఎంసి మట్టెవాడ, వరంగల్ చౌరస్తా, బట్టల బజార్, సంతోషి మాతా కాలనీ ఏరియా, హంటర్ రోడ్, చార్ బౌలి, గోవింద రాజులగుట్ట, క్రిస్టియన్ కాలనీ, లేబర్ కాలనీ, ఎస్ ఆర్ టి ఎనుమాముల, ఆరేపల్లి, కొత్తపేట, గొర్రెకుంట, కీర్తి నగర్, పైడిపల్లి, మొగిలి చర్ల, ధర్మారం ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు.

- వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

# 'కారు'కు మరమ్మతులు



వివరాలు 2లో..

**రంగంలోకి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

**పార్టీ డ్యామేజ్ కాకుండా చర్యలు**

**పైనుంచి కింది స్థాయి వరకు ప్రక్షాళన**

**పాత కమిటీలన్నీ రద్దు**

**యాక్టివ్‌గా పనిచేసిన వారికే పదవులు**

తెలంగాణ రాష్ట్రంలో త్వరలో భారత రాష్ట్ర సమితి పార్టీ ఖాళీ అన్న ప్రచారం రోజు రోజుకూ బలపడుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి కీలక నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. త్వరలోనే మరికొంత మంది కూడా పార్టీ వీడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదే ఒరవడి కొనసాగితే చివరికి మిగిలేది కేసీఆర్, కేటీఆర్, కవిత, హరిశ్ రావులే అంటూ చెప్పకొస్తున్నారు. అయితే కేసీఆర్ విధానాలే బీఆర్ఎస్ పార్టీని ముంచాయంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో పార్టీకి తిరిగి జీవం పోసేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చర్యలు చేపట్టారు. తనే స్వయంగా రంగంలోకి దిగి పార్టీని వీడాలనుకుంటున్న వారితో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతోపాటు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు. జిల్లా, గ్రామ స్థాయిలో పూర్తి కమిటీలు లేకపోవడంతోనే పార్టీకి నష్టం జరిగిందని భావించిన కేసీఆర్ పైనుంచి కింది స్థాయి వరకు అన్ని విభాగాలు, వాటి అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేసే పనిలో పడ్డారు. అయితే ఆ బాధ్యతలను పార్టీకోసం మొదటినుంచి పని చేస్తున్న వారికే అప్పగించాలని భావిస్తున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్



8లో

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం

**పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క**

**జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్షా సమావేశం**



2లో

## ఎకో టూరిజంపై స్పెషల్ ఫోకస్

ఉద్యోగావకాశాల పెంపుకు కృషి

అడవులను పరిరక్షిస్తూనే అభివృద్ధి

అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ



8లో

## పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్**

# 'కారు'కు మరమ్మతులు



వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..



**రంగంలోకి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

**పార్టీ డ్యామేజ్ కాకుండా చర్యలు**

**పైనుంచి కింది స్థాయి వరకు ప్రక్షాళన**

**పాత కమిటీలన్నీ రద్దు**

**యాక్టివ్ గా పనిచేసిన వారికే పదవులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్లమెంట్ ఫలితాల తరవాత రాష్ట్రంలో బీఆర్ఎస్ పూర్తిగా చతికిల పడింది. ఊతకర్ర పట్టుకుని లేద్దామన్నా లేవలేని పరిస్థితి నెలకొంది. కనీసం ఒక్కసీటు కూడా గెలువక పోవడంతో ఆ పార్టీ పెద్దలు ఆలోచనలో పడ్డారు. ప్రజలను మభ్యపెట్టి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లబ్ధి పొందిందని, లోక్ సభ ఎన్నికల్లో అలాంటి పరిస్థితి ఉండదంటూ గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానానికి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. దీంతో తప్పు ప్రజలది కాదు పార్టీ విధానాల్లోనే ఉందని గ్రహించిన బీఆర్ ఎస్ బాస్ కేసీఆర్ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. గులాబీ శ్రేణుల్లో తిరిగి ఉత్సాహం నింపడంతోపాటు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు. జిల్లా, గ్రామ స్థాయిలో పూర్తి కమిటీలు లేకపోవడంతోనే నష్టం జరిగిందని భావిస్తున్న పెద్దలు పైనుంచి కింది స్థాయి వరకు అన్ని విభాగాలు, వాటి అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేసే పనిలో పడ్డారు. అయితే ఆ బాధ్యతలను పార్టీకోసం మొదటినుంచి పని చేస్తున్న వారికే అప్పగించాలని భావిస్తున్నారు.

## పార్టీ వీడిన నేతలు..

కొంతమంది ముఖ్య నేతలు పార్టీని వీడారు. ఈ పరిణామం పార్టీని డ్యామేజ్ చేసిందనే చెప్పవచ్చు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతలైన స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపి రంజిత్ రెడ్డి, కేకే, కడియం కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరే కాకుండా బీఆర్ఎస్ కు చెందిన 20మంది ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరనున్నట్లు ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వాఖ్యలు నేడు సంచలనంగా మారాయి. ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, వివేకానంద, సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్, గూడెం మహిపాల్ యాదవ్, అరికపూడి గాంధీ, కాలే యాదయ్యలు ముఖ్యమంత్రితో టచ్ లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే పార్టీలో మేజర్ సభ్యులు బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరినట్టు అవుతుంది.

## అసంతృప్తులు..

బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో వివిధ కమిటీల ఏర్పాటుపై పూర్తి నిర్లక్ష్యం వహించారు. ఆరేళ్ల క్రితం 69మందితో బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. పార్టీ అనుబంధ కమిటీలైన మహిళ, యువత, రైతు, కార్మిక, విద్యార్థి, సోషల్ మీడియా కమిటీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. జిల్లాల అధ్యక్ష బాధ్యతలు కూడా ఎమ్మెల్యేలకు అప్పగించడంతో పార్టీలోని సీనియర్లు, ఉద్యమ కారులు అసంతృప్తికి గురయ్యారు. ఎమ్మెల్యేలు కూడా పని ఒత్తిడితో పార్టీ పటిష్ఠతకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్న ఆరోపణలున్నాయి.

## దిద్దుబాటు చర్యలు..

ఒక్కొక్కరుగా పార్టీ వీడుతున్న వారిని కాపాడుకునే పనిలో పడ్డారు బీఆర్ఎస్ నేతలు. అన్ని జిల్లాల్లో పర్యటనలు నిర్వహించి క్యాడర్ లో ఉత్తేజం నింపేందుకు కేసీఆర్ శ్రీకారం చుట్టారు. ఆ బాధ్యతలను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అప్పగించారు. పార్టీ శిక్షణ కార్యక్రమాలతో పాటు జిల్లా కేంద్రాల్లో మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గతంలో కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోని బీఆర్ఎస్ పెద్దలు తమ పద్ధతిని మార్చుకోవాలంటూ అధిష్ఠానం హితవు పలుకుతోంది. కార్యకర్తల సమస్యలను నియోజకవర్గం, జిల్లా స్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ సంస్థాగతంగా బలంగా ఉన్నప్పుడే అధికార పార్టీని ధీటుగా ఎదుర్కోగలమన్న భావనతో దిద్దుబాగు చర్యలకు శ్రీకారం చుట్టారు. సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటుతో పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నారు.

# ఎకో టూరిజంపై స్పెషల్ ఫోకస్

**ఉద్యోగావకాశాల పెంపుకు కృషి**

**అడవులను పరిరక్షిస్తూనే అభివృద్ధి**

**అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ వ్యాప్తంగా ఎకో టూరిజం (ప్రకృతి పర్యాటకం) అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నదని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. పర్యావరణానికి, వన్య ప్రాణులకు ఏ మాత్రం హాని కలగకుండా, వాటి సహజ ఆవాసాలను పరిరక్షిస్తూ, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ ఎకో టూరిజం పాలసీని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి సురేఖ తెలిపారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని అటవీ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎకో టూరిజం కన్సల్టేటివ్ కమిటి ఛైర్మన్, మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కన్సల్టేటివ్ కమిటి మెంబర్లు అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పిసిసిఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్) పర్గెయిన్, పిసిసిఎఫ్ (కంపా) సువర్ణ, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఇండియా, స్టేట్ డైరక్టర్ ఫరీదా తంపల్, తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పోరేషన్ (ఎకో టూరిజం) ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ రంజిత్ నాయక్, జాయింట్ సెక్రటరీ హరిత, డిప్యూటీ సెక్రటరీ(అటవీ) శ్రీలక్ష్మి, సిసిఎఫ్ క్షితిజ, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ఛైర్మన్ ఇమ్రాన్ సిద్దిక్, ఎండోమెంట్స్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పోరేషన్ జీఎం ఉపేందర్ రెడ్డి, సిఐఐ మెంబర్ శ్రీదేవి రావు, డిఎఫ్ఓలు శివ ఆశిష్ సింగ్, నవీన్ రెడ్డి, సిద్ధార్థ్ వి సింగ్, కిష్టా గౌడ్, రాహుల్ కె జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, ఎకో టూరిజం అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సరికొత్తగా ఆవిష్కరించనున్నామని మంత్రి సురేఖ అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 12 సర్క్యూట్ లలో 40 ఎకో టూరిజం స్పాట్లను గుర్తించినట్లుగా మంత్రి సురేఖ తెలిపారు. అడ్వెంచర్, రీక్రియేషన్, ఆధ్యాత్మిక, వారసత్వ, సినీ, వెడ్డింగ్, నేచర్ అండ్ వైల్డ్ లైఫ్, హెరిటేజ్ అండ్ కల్చర్ తదితర అంశాల ఆధారంగా మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటిని ఎకో టూరిజం స్పాట్లుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం పాలసీ రూపకల్పనలో అటవీ, దేవాదాయ, రెవెన్యూ, పర్యాటక శాఖలను సమన్వయం చేసుకుంటూ, అడ్డంకులను అధిగమించుకుంటూ సాగాలని అటవీ అధికారులకు మంత్రి సురేఖ సూచించారు. ఆర్కియాలజీ శాఖతో సంప్రదింపులు జరిపి రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాల్లో పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వం ఎకో టూరిజం పాలసీ రూపకల్పన పేరుతో కాలయాపన చేసిందని మంత్రి విమర్శించారు. ఒడిషా, కర్నాటక రాష్ట్రాల్లో అమలవుతున్న ఎకో టూరిజం విధానాలను అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఆ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు గమనించిన పరిస్థితులను ఇక్కడి పరిస్థితులతో బేరీజు వేసుకొని అత్యుత్తమ ఎకో టూరిజం పాలసీల రూపకల్పనకు కృషి చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. గతంలో జరిగిన సమావేశంలో ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతాలు, వన్యప్రాణుల, వలస పక్షుల ఆవాసాలు, జీవవైవిధ్య ప్రాంతాలు, వారసత్వ కట్టడాలున్న ప్రాంతాల్లో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి గారు సూచించిన విషయాన్ని మంత్రి సురేఖ అధికారులకు గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎకో టూరిజం స్పాట్లను అభివృద్ధి చేసేందుకు పిపిపి పద్ధతిలో నిధులను సమీకరించాలి. రాష్ట్రంలోని ప్రధాన నది అయిన గోదావరి నదీపరివాహక ప్రాంతంలోనూ, జలపాతాలు, నీటివనరులన్న ప్రాంతాల్లో ఎకో టూరిజం స్పాట్లను అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలి. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా పథకాలు రచించాలి. ఎకో టూరిజం స్పాట్లకు సంబంధించిన సమస్త సమాచారాన్ని వెబ్ సైట్లలో అందించాలి. పూర్తిస్తాయిలో ఆన్లైన్ బుకింగ్ సదుపాయాన్ని కల్పించాలి. ఆయా పర్యాటక ప్రదేశాల్లో స్థానికులకు, మహిళా సంఘాలకు ఉపాధిని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలి. అటవీశాఖ ఆధ్వర్యంలో స్టాళ్ళు ఏర్పాటు చేయాలి. సామాజిక బాధ్యతగా ఎకో టూరిజం స్పాట్లకు సెలబ్రిటీల ద్వారా ప్రచారం కల్పించాలి. మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్వహణ ఉండాలి ప్లాస్టిక్ ఫ్రీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలి. ఏ చిన్న ప్రాణికి కూడా హాని కలగని విధంగా ఎకో టూరిజం పాలసీ రూపకల్పనను చేపట్టాలి" అని మంత్రి సురేఖ అధికారులకు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎకో టూరిజం పాలసీని రూపొందించే దిశగా కన్సల్టేటివ్ కమిటి ఒకడుగు ముందుకు వేసిందని మంత్రి సురేఖ తెలిపారు. ఈ సమావేశంలో క్రోడీకరించిన సమాచారాన్ని సీఎం గారి దృష్టికి తీసుకుపోయి విధివిధానాలు ఖరారు చేసిన తర్వాత మరోమారు కన్సల్టేటివ్ కమిటి సమావేశమవుతుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.



# కుందయ్యపల్లిలో తాగునీటి కటకట

**రెండు వారాలుగా ఇబ్బందులు**

**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు గ్రామ పంచాయతీ పరిధి కుందయ్యపల్లి గ్రామస్తులు తాగునీటి కోసం రెండు వారాలుగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీకి చెందిన మోటర్ కాలిపోవడంతో నల్లాల ద్వారా తాగునీరు రావడంలేదు. మిషన్ భగీరథ పైపులైన్ ఇంటింటికీ ఉన్నప్పటికీ సరిపడ తాగునీరు రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాగునీటి కోసం తాము పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ ఇన్ చార్జి అధికారి, పంచాయతీ కార్యదర్శి హరిశ్చంద్రారెడ్డిని వివరణ కోరగా తాము మిషన్ భగీరథ సర్వే చేస్తున్నామని, ప్రస్తుతం నిధుల కొరత ఉందని, అయినప్పటికీ మోటర్ రిపేర్ చేయించి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

## కార్పొరేట్ కాలేజీలు వద్దు.. ప్రభుత్వ కళాశాలలే ముద్దు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కార్పొరేట్ కాలేజీలు వద్దు.. ప్రభుత్వ కళాశాలలే ముద్దు అంటూ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం లెక్చరర్స్, విద్యార్థులు శాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ తీసి ప్రజలు, విద్యార్థుల్లో చైతన్యం కలిగించారు. వారి ర్యాలీకి మద్దతుగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ హాజరై మద్దతు పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రులు కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలలో లక్షలు లక్షలు ఫీజులు కట్టి వారికి నాణ్యమైన విద్య అందక విద్యార్థులు మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి తల్లిదండ్రులు ఎంతో శ్రమపడి డబ్బులు కడితే నాణ్యమైన విద్య అందించడం లేదని, కార్పొరేట్ ప్రైవేటు వ్యవస్థలలో అడ్మిషన్ అయిన తర్వాత వారి తల్లిదండ్రులను డబ్బుల కోసం వేధిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తూ, ప్రైవేట్ కార్పొరేట్ వ్యవస్థల దోపిడీలకు అడ్డుకట్టవేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ సునీల్, హిమబిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదలకు దూరమైన ప్రైవేట్ విద్య
## బీజేపీ నేత కుందూరు మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజులు మోపుతూ మధ్యతరగతి ప్రజలకు విద్యను దూరం చేస్తున్నాయని బీజేపీ జిల్లా నేత కుందూరు మహేందర్ రెడ్డి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలపై విమర్శలు గుప్పించారు. కేజీ టు పీజీ ఉచిత విద్యా అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఆ పథకాన్ని అమలు చేయలేదని మండిపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నించడం లేదన్నారు. అధిక ఫీజులు, బస్ చార్జీలు, యూనిఫాం చార్జీలు, పుస్తకాల కోసం అధిక రేట్లు వసూలు చేస్తూ అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలకు అనుకూలంగా పనిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నీట్ పేపర్ లీకేజీపై
## సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

### ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్ బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. వరంగల్ లో జరిగిన ఏఐఎస్ బీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన హకీమ్ నవీద్ మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై బహిర్గతం కావద్దనే దురుద్దేశంతో హుటాహుటిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదల రోజున నీట్ పరీక్ష ఫలితాలను ఆగమేఘాల మీద విడుదల చేసి విద్యార్థుల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేశారని హకీమ్ నవీద్ ఆరోపించారు. ఎన్ టీఏ వైఫల్యం వల్ల లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో నెట్టి వేయబడిందని ఆయన అన్నారు. ఈ ఉదంతంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఎన్ టీఏను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు పిలుపునిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ రోహిత్, నగర నాయకులు అఖిల్, సుమన్, రాజు, సాయి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# సాకేత పాఠశాల పర్మిషన్ రద్దు చేయాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా అధిక ధరలకు యూనిఫాంలు, పుస్తకాలు, స్టేషనరీ అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాల పై చర్యలు తీసుకోవాలని డీఎస్సీ విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామంలో ఉన్న సాకేత పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా యూనిఫాంలు, బుక్కులు, స్టేషనరీ అధిక ధరలకు అమ్ముతున్నట్లు తెలుసుకున్న డీఎస్సీ విద్యార్థి నాయకులు పాఠశాల ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ సాకేత పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి, పాఠశాల ఆవరణలోనే ఒక రూంలో యూనిఫామ్, పుస్తకాలు, స్టేషనరీలను పొందుపరిచి కౌంటర్ ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అధిక ధరలతో అమ్ముతున్నారనీ విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. అధిక ధరలకు యూనిఫాంలు విక్రయిస్తున్న సాకేత పాఠశాల యాజమాన్యంపై






చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈవో, ఎంఈఓలు వెంటనే స్పందించి పాఠశాల పర్మిషన్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో ప్రైవేటు పాఠశాలలో అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. పర్యవేక్షణ లోపంతో ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యాంగ పాఠశాలాల్లోనే యూనిఫామ్, పుస్తకాలు, స్టేషనరీ అక్రమంగా విక్రయిస్తున్నారన్నారు. పర్మిషన్లు లేకున్నా అడ్మిషన్లు కొనసాగిస్తున్నారన్నారు. ఐదు మండలాలకు ఒకే ఎంఈఓ ఉండడం వలన ప్రైవేటు పాఠశాలల్లో పర్యవేక్షణ కరువైందన్నారు. ఎంఈఓ పర్యవేక్షణ లేనందువలననే ప్రైవేటు పాఠశాలల్లో ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, వెంటనే పూర్తిస్థాయిలో ఎంఈఓను కమలాపూర్ మండలానికి నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాకేత పాఠశాలపై వెంటనే చర్యలు తీసుకోని, పర్మిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## అనుమతి లేని ఆల్ఫోర్స్ కాలేజీని సీజ్ చేయాలి

### ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అనుమతి లేని ఆల్ఫోర్స్ కాలేజీని సీజ్ చేయాలని కోరుతూ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మాధవ్ రావుకు ఏఐఎఫ్ డీఎస్ గ్రేటర్ వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ వరంగల్ పట్టణంలో కొత్త వాడ ప్రాంతంలో ఉన్నఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఆయన అన్నారు. ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు ఎలాంటి అనుమతులు లేకుండా విద్యార్థి తల్లిదండ్రులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు దోవ పట్టించి అడ్మిషన్ తీసుకొని కళాశాలను నడిపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని,తల్లిదండ్రులను మోసం చేసిన ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వా నియమ నిబంధనలను తుంగలో తొక్కి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థి తల్లిదండ్రుల రక్తం తాగుతున్న ఆల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డిపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఫ్ డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, గ్రేటర్ వరంగల్ నాయకులు పోలబోయిన రాజు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీజీ కళాశాలలో స్వచ్ఛభారత్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుబేదారి యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ ప్రోగ్రాం కింద క్యాంపస్ లో కాలేజ్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్యాంపస్ వాతావరణం అహ్లాదకరంగా ఉండడం కోసం పిచ్చి మొక్కలు పీకడం, పేరుకుపోయిన చెత్తను సేకరించి బయటపడేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి యువత శారీరక శ్రమకు చాలా దూరంగా ఉంటున్నారని, దీంతో అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. అందుకే ఎన్ఎస్ఎస్ క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు కాలేజ్ క్యాంపస్ ఆహ్లాదకరంగా ఉండటానికి, విద్యార్థులకు అవసరమైన శారీరక శ్రమ కల్పించడం జరుగుతుందన్నారు. అందుకే ప్రభుత్వం స్వచ్ఛ భారత్ అనే సామాజిక సేవా కార్యక్రమాన్ని చాలా గొప్పగా యూనివర్సిటీలలో అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిరంజన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్, డాక్టర్ రాజు, డాక్టర్ రమాదేవి, డాక్టర్ వీరేందర్, డాక్టర్ దేవోజి నాయక్, డాక్టర్ భాగ్యమ్మ, డాక్టర్ సరిత, డాక్టర్ కిరణ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, రాజేంద్రప్రసాద్, డాక్టర్ శంకర్, డాక్టర్ వినోద, రజిని, సరిత, డాక్టర్ విజయ్, డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ శిశు మందిర్ నిర్మాణంలో డాక్టర్ నేదునూరి బలరాంది కీలకపాత్ర

### దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాజం సురక్షితంగా అభివృద్ధి పథంలో నిలబడాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని, విద్యాభివృద్ధి కోసం హసన్ పర్తి మండల కేంద్రంలో సరస్వతీ విద్యా మందిరాన్ని నిర్మించి అందులో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ ఎందరినో తీర్చిదిద్దిన చరిత్ర నేదునూరి బలరాందని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ తెలిపారు. శనివారం హసన్ పర్తి మండల కేంద్రంలో అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన నేదునూరి బలరాం భౌతిక దేహాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి నేదునూరి రాజమౌళి ఆయన భౌతికాయాన్ని సందర్శించి పూలమాల వేసి సంతాప సందేశాన్ని తెలియజేశారు. ఒకవైపు ఆర్య సమాజంలో ఉపాధ్యాయుడిగా కొనసాగుతూ మరొకవైపు ఆర్ఎంపీ డాక్టర్ గా అందరికి వైద్యాన్ని అందజేసిన ఉత్తముడు నేదునూరి బలరాం అని ఆయన సేవలను కొనియాడారు. విద్యాభివృద్ధి, ఆరోగ్యవంతమైన సమాజం ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించి కొంతకాలం ఉపాధ్యాయుడిగా మరికొంత కాలం వైద్యుడిగా సేవలందించడాన్ని శ్లాఘించారు. నేదునూరి రాజమౌళి, ప్రముఖ ఆర్టిస్టు యాంకర్ కనకం రాజు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ బలరాం మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు, స్థానిక కార్పొరేటర్ శివకుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ నేదునూరి కుమారస్వామి, ముదిరాజ్ సంఘం నాయకులు పిట్టల కుమారస్వామి, కుమ్మరి సంఘ కుల నాయకులు నేదునూరి సాంబయ్య, బలరాం కుమారులు వేద ప్రకాష్, ఇంద్రసేన, దయానందు, భార్య రాజేశ్వరి, కందికొండ చేరాలు, డాక్టర్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మహిళ కానిస్టేబుల్‌కు రక్షణ కల్పించండి

## దళిత సంఘాల ఆధ్వర్యంలో డీఎస్పీకి ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, కాటారం :** భూపాలపల్లి జిల్లా కాటారం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని కాలేశ్వరం పోలీస్ స్టేషన్ లో ఎస్సై వల్ల అత్యాచారానికి గురైన మహిళా కానిస్టేబుల్ విషయంలో శనివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మామిడిపల్లి బాపయ్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు (గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ), ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సీనియర్ జర్నలిస్ట్ బొంకూరి మధు, ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు పీక కిరణ్, రాష్ట్ర కార్యదర్శి మంతెన లింగయ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా సీనియర్ నాయకులు పొట్ల పోచయ్య, ఆదివాసి దళిత మహిళ హక్కుల సంఘం మహిళా కన్వీనర్ కుడిమెట్ల సరస్వతీలు, మహిళా కానిస్టేబుల్ కు ఎస్సై ద్వారా జరిగిన ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. కాళేశ్వరం, మహాదేవపూర్ ప్రాంతాలలో పర్యటించి ఎస్సైగా విధులు నిర్వహించిన సమయంలో భవాని గౌడ్ చేసిన పలు సంఘటనలపై నివేదిక తయారు చేశారు. ఆడవారి పట్ల కాలేశ్వరం పోలీస్ స్టేషన్ కు వస్తున్న బాధితుల పట్ల ఆయన వ్యవహరించిన తీరు పలువురిని అడిగి తెలుసుకోవడం జరిగింది. పోలీసు ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకొని బాధితులను అవమానిస్తూ, వారిపట్ల దారుణంగా వ్యవహరించేవారని కమిటీకి పలువురు వివరించారు. మహిళా కానిస్టేబుల్ విషయంలో కూడా తనకు అధికారుల అండ ఉందన్న తెగింపుతో ఆమె పట్ల అమానుషంగా ప్రవర్తించారని కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. యావత్ సమాజం సిగ్గుపడే విధంగా, పోలీస్ డిపార్ట్మెంట్ కు కళంకం తీసుకువచ్చిన ఎస్సైని ఉద్యోగం నుండి తొలగించడంతో తగిన శాస్త్రి జరిగిందన్నారు. కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి దృష్టికి సంఘటనకు సంబంధించిన పలు విషయాలను తీసుకువెళ్లారు. ఆమెకు రక్షణ కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు మంతెన చిరంజీవి, చంద్రగిరి అశోక్ పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ ఘటనకు మోడీదే బాధ్యత

## పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని అశోక సెంటర్ లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ప్ల కార్డ్స్ చేతబట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బి. నరసింహారావు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ పై ప్రధానమంత్రి మోడీ స్పందించాలని, నీట్ బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టాలని, పేపర్ లీకేజీకి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టీఏ)ను వెంటనే రద్దు చేయాలని, పేపర్ లీకైనన రాష్ట్రాలలో నీట్ పరీక్ష మళ్లీ రీ కండక్ట్ చేయాలని కోరుతూ శనివారం శాంతియుతంగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఇంటిని ముట్టడించిన పీడీఎస్‌యూ, ఇతర విద్యార్థి సంఘ నాయకులపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ నాయకులు వై.దీపక్ మహేంద్ర, ఏ.గోపీచంద్, వి.రాజు, సాయి చరణ్, నాని, గణేష్, శృతి, అనిత, ప్రణవి, కీర్తిక, కృషిక, అనిత, స్పందన, ప్రియ, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విశ్వవిద్యాలయ స్థలం చుట్టూ సరిహద్దు ఏర్పాటు చేయాలి



**వరంగల్ వాయిస్, ములుగు :** గిరిజన విశ్వవిద్యాలయ స్థలం చుట్టూ సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం ఎదురు గిరిజన విశ్వవిద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీ కోసం మొత్తం 337 ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందని, సంబంధిత స్థలాన్ని రెవెన్యూ అధికారులు ట్రైబల్ వెల్ఫేర్ శాఖకు బదలాయింపు చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం యూనివర్సిటీ ఏర్పాటులో భాగంగా తాత్కాలిక తరగతుల నిర్వహణ ములుగు మండలంలోని ట్రైబల్ యూత్ ట్రైనింగ్ సెంటర్ జకారంలో తరగతులు ప్రారంభం అవుతున్నాయని తెలిపారు. 337 ఎకరాల స్థలాన్ని ఎవరు అక్రమించకుండా చుట్టూ సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేయాలని, స్థలాన్ని ఎవరు ఆక్రమించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సీహెచ్ మహేందర్ జి, ఆర్డీఓ కే.సత్యా పాల్ రెడ్డి, తహసీల్దార్ విజయ భాస్కర్, ఆర్ఐ విజేందర్, సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరానికి చెందిన కీ.శే. వేమిశెట్టి శ్రీనివాస్ జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని పారిజాతం, వారి స్నేహితురాలు రేఖ, మనవరాలు కుమారి ఆద్య, శ్యామ్, కుమారుడు-కోడలు ప్రభుకుమార్-హిమబిందు దంపతులు, వారి కుమార్తెలు-అల్లుండ్లు కొమరవెల్లి ప్రతిభ-ప్రవీణ్ దంపతులు, దొడ్డ-ప్రియాంక సునీల్ దంపతులు కలిసి సుమారు రూ.40,000 విలువ చేసే నోట్ పుస్తకాలను ఏవీవీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏవీవీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల మన వరంగల్ నగరంలో గత 8 దశాబ్దాల నుంచి విద్యా రంగంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిన సంస్థ అని తెలిపారు. కాబట్టి, ఈ పాఠశాలలో చదవడం విద్యార్థుల అదృష్టమన్నారు. సంస్థను విజయవంతంగా నడిపిస్తున్న యాజమాన్యాన్ని, విశేష కృషి చేస్తున్న ప్రస్తుత, పూర్వ ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయ బృందానికి అభినందనలను తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు కృషి చేసిన వీరేశలింగంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు, వారి కుటుంబ సభ్యులకు విద్యా సంస్థల శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, ప్రిన్సిపల్ డా.ఎ.భుజేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ డా.చందా విజయ్ కుమార్, శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, ప్రిన్సిపల్ డా.ఏ.భుజేందర్ రెడ్డి, పూర్వ ప్రధానోపాధ్యాయులు, ప్రస్తుత అకాడమిక్ కోఆర్టినేటర్ శ్రీ వాసుదేవులు, దాతలు వారి కుటుంబ సభ్యులు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం సంధ్యారాణి, నవీన్, భాగ్యలక్ష్మి, సుధారాణి, రమాదేవి, వీరేశలింగం, ఫిలిప్ లాజరస్, భాస్కర్, నిహారిక, అనూష, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయాన్ని సందర్శించిన ఎస్ఐలు

## రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రామప్ప దేవాలయాన్ని శనివారం ములుగు జిల్లాలో పనిచేస్తున్న ఎస్ఐలు చల్లా రాజు, అప్పాని వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఆలయ పూజారులు హరీష్ శర్మ, ఉమాశంకర్ లు ఈ సందర్భంగా వారికి స్వామి వారి ఆశీర్వాదంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎస్ఐలు రాజు, వెంకటేశ్వర్లు ఆలయ పరిసరాల్లో కాసేపు ఆనందంగా గడిపారు.

# రైతు పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ రుణమాఫీ హామీ ఇచ్చిన విధంగా రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వరంగల్ యూత్ కాంగ్రెస్ నాయకులు కల్లూరి పవన్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పవన్ మాట్లాడుతూ డిసెంబర్ 12,2018 నుంచి డిసెంబర్ 9, 2023 మధ్యలో తీసుకున్న రైతులకు వర్తింపు చేస్తుందని అలాగే, రుణమాఫీతో 47 లక్షల మంది రైతులకు లబ్ధి జరుగుతుందన్నారు. రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న దానిని చూసి ప్రతి పక్ష పార్టీ ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటుందని అన్నారు.

# ప్రతి శనివారం ‘క్లీన్ అండ్ గ్రీన్’



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ కాంపస్ కళాశాలలలోని వివిధ విభాగాలు “క్లీన్ అండ్ గ్రీన్” కార్యక్రమం ప్రతి శని వారం చేపట్టాలని రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఇచ్చిన ఉత్తర్వులు మేరకు వివిధ విభాగాలు తమ విభాగాల పరిధిలోని చెత్త, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ ఏరివేశారని, ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. అమరవేణి అన్నారు. విద్యార్థులు తమ తమ పరిసరాలలో ప్రతి శనివారం ఒక గంట ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో విభాగ అధిపతి డాక్టర్ సంకేనేని వెంకట్ విద్యార్థులతో కలిసి క్లీన్ అండ్ గ్రీన్‌లో పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఓరుగల్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుకారి శ్రీధర్ రావు, ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ లు కోరారు. హనుమకొండ హంటర్ రోడ్డులో త్వరలో ప్రారంభం కాబోతున్న మెడికవర్ హాస్పిటల్ వారు నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాన్ని సందర్శించి స్వయంగా వారు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆసక్తి కల నగర ప్రజలంతా ఉచితంగా నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో అందిస్తున్నసేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ నెల 30వ తేదీ వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఏర్పాటు చేయాలి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ కు హనుమకొండ గిరిజన కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు ఎల్ హెచ్ పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్, బీఆర్ఎస్వీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జి లకావత్ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ మండలం శివునిపల్లిలో గ్రామంలోని అప్పటి ప్రభుత్వం గిరిజన విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం స్పెషల్ హాస్టల్ పేరుతో 2005, ఏప్రిల్, 27న సుమారు రూ. 25 లక్షలు మంజూరు చేసి ఆ భవనం పూర్తి చేయడానికి అప్పటి ధరలకు అనుగుణంగా నిధులు సరిపోలేదని తెలిపారు. హాస్టల్ భవనం పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్ మధ్యలోనే ఆపేశారని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని గిరిజన తండాల గిరిజన విద్యార్థులకు చదువుకోవడానికి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గిరిజన తండాలలో పదో తరగతి వరకు పాఠశాలు లేక మండల కేంద్రానికి పోవాల్సి ఉంటుందని, తండాల నుంచి మండల కేంద్రానికి చదువుకోడానికి రవాణా సౌకర్యాలు లేక గిరిజన విద్యార్థులు చదువులు మధ్యలో ఆపేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఏర్పాటు చేస్తే గిరిజన విద్యార్థులకు ఉన్నత చదువులు చదువుకోవడానికి అవకాశాలు ఉంటుందన్నారు. దీనిపై జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ స్పందించి త్వరలో గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఏర్పాటు అయ్యేలా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి ఉపాధ్యక్షుడు బానోత్ భాస్కర్, ఎన్ఐటీ విద్యార్థి మాలోతు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రెండు లక్షల రైతు రుణమాఫీ ఏకకాలంలో చేస్తున్న రైతుల పక్షపాతి, రైతు బాంధవుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి టీపీసీసీ సెక్రటరీ గీతా సెల్ రావుల వెంకట రమేష్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట రమేష్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే ఇచ్చిన మాట నిలబెట్టుకునే పార్టీ అని కొనియాడారు. బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని ఈ సందర్భంగా వెంకట రమేష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# ఎస్సీ, ఎస్టీ కేసులలో బాధితులకు న్యాయం చేయాలి

## డీబీఎఫ్ ఆధ్వర్యంలో పరకాల ఏసీపీకి సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల :** ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులలో విచారణను వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా చూసి బాధితులకు న్యాయం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు చుంచు రాజేందర్ కోరారు. ఈ మేరకు శనివారం పరకాల ఏసీపీ కిషోర్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితుల భూములను ఇతర కులాలవారు కబ్జాచేసుకోని దళిత కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. రోజు రోజుకు దళితుల మీద, ఆదివాసీల మీద, మహిళల మీద దాడులు, దౌర్జన్యాలు జరిగిపోతున్నాయని వీటిని అరికట్టడంలో పోలీసుల పాత్ర మరువలేనిదని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, ఆసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సందెల రవీందర్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, మాజీ సర్పంచి మాదాసి సాంబయ్య, గిన్నారపు శ్రీకాంత్, మాదాసి రాజు, మాదాసి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో దివాకర టీఎస్ పురావస్తు శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ప్రసాద్ స్కీంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను పురావస్తు శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రసాద్ స్కీంలో భాగంగా 10 ఎకరాల స్థల విస్తీర్ణంలో రూ.61.99 కోట్ల నిధులతో నిర్మాణం జరుగుతున్న ఇంటర్ప్రిటేషన్ సెంటర్ పనులను వేగవంతం చేయాలని, రామప్ప దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని, రామప్పకు వచ్చే పర్యాటకులు స్టాల్స్, ఫుడ్ కోర్ట్స్, పార్క్, ఆడిటోరియం, టాయిలెట్స్, బ్యాటరీ వెహికిల్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన అనంతరం యునెస్కో నియమ నిబంధనల ప్రకారం రామప్ప దేవాలయం పరిసరాలలో ఉన్న శివాలయం, గొల్లగుడి దేవాలయాలు రామప్ప దేవాలయం ఒకే ప్రాంగణంలో ఉండాలని, వాటికి సంబంధించిన స్థల సర్వేలు నిర్వహించాలని పురావస్తు శాఖ అధికారులు కలెక్టర్ ను కోరారు. శివాలయం, గొల్లగూడి పరిసర ప్రాంతాలను త్వరలోనే కలెక్టర్ పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర పురావస్తు శాఖ అసిస్టెంట్ సూపరిండెంట్ రోహిణి పాండే అంబేద్కర్, జిల్లా పురావస్తు శాఖ అధికారి యం.మల్లేష్, పురావస్తు శాఖ సర్వేయర్ ప్రశాంత్, ఏఈ విజయ్, క్షేత్ర ఫౌండేషన్ సూర్యనారాయణ మూర్తి, కలెక్టరేట్ సూపరెండెంట్ శివ కుమార్ పాల్గొన్నారు.

# రైతు రుణమాఫీపై కాంగ్రెస్ నేతల హర్షం



**వరంగల్ వాయిస్, పరకాల :** కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రైతుల కోసం రూ.31 వేల కోట్లతో ఏకకాలంలో ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేసి అన్నదాతను రుణ విముక్తుడిని చేస్తున్నందుకు కృతజ్ఞతగా పరకాలలో శనివారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశానుసారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల మాజీ శాసనసభ్యులు మొలుగూరి భిక్షపతి, మునిసిపల్ చైర్ పర్సన్ అనిత రామకృష్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ నిన్న జరిగిన క్యాబినెట్ మీటింగ్లో రైతు రుణమాఫీని ప్రకటించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరునెలల లోపే ఇచ్చిన హామీలను నెరవేర్చిందని తెలిపారు. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకోకుండా అప్పుల పాలు చేశారని విమర్శించారు. లోటు బడ్జెట్ ఏడు లక్షల కోట్లు ఉన్నప్పటికీ రైతుల కోసం ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రైతులందరికీ రుణమాఫీ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. రాబోయే రోజుల్లో బడుగు బలహీన వర్గాలు, రైతులు, ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మడికొండ సంపత్, ఒంటర్ సారయ్య, నలేళ్ల జ్యోతి అనిల్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మచ్చ సుమన్, సమన్వయ కమిటీ సభ్యులు రాజేశ్వర రావు, రంజాన్ అలీ, మెర్గు శ్రీశైలం, దుబాసి వెంకటస్వామి, చందుపట్ల రాఘవ రెడ్డి, చిన్నలా గౌనాద్, దార్న వేణుగోపాల్, మడికొండ శ్రీనివాసు, బొమ్మకంటి చంద్రమోగిలి పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్ అధ్యక్షుడిగా శేర్ల అనిల్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 42వ డివిజన్ లో శుక్రవారం సాయంత్రం 8గంటలకు స్థానిక లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ ఐదో వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం లయన్స్ క్లబ్ లో 8మంది నూతన సభ్యులుగా వార్షికోత్సవలో సభ్యత్వం పొందారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్ అధ్యక్షుడిగా శేర్ల అనిల్ కుమార్, సెక్రెటరీగా కందికొండ కుమారస్వామి, కోశాధికారిగా సీహెచ్ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ చేత డాక్టర్. కౌడి చంద్రశేఖర్ ఆర్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షుడు శేర్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంగా అప్పగించిన అధ్యక్ష పదవికి న్యాయం చేస్తానని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పర్యావరణానికి, ఆకలితో బాధపడుతున్న ప్రజలకు, కంటి చూపుతో బాధపడుతున్న, షుగర్ వ్యాధిగ్రస్తులకు, క్యాన్సర్ బారిన పడిన శిశువులకు సంబంధించిన కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు, నిర్వహించి రాబోయే సంవత్సరంలో 45వేల మంది ప్రజలకు న్యాయం చేకూరేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్ ఎన్.వెంకటేశ్వరరావు, ఇనాగరేషన్ ఆఫీసర్ గా డాక్టర్.చంద్రశేఖర్ ఆర్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లయన్ ఎన్.సుధాకర్ రెడ్డి, జి.సురేష్ కుమార్, కే.సుభాష్, హబీబ్, నివేదిత రెడ్డి, డాక్టర్ జి.రాము, డాక్టర్ ఏ.రాజగోపాల్, చందా మనోహర్, లయన్ బరుపాటి.రవి, ఎండీ యాకుపాషా తదితరులు పాల్గొన్నారు.

# సమాన విద్య, వైద్యానికి పోరాడుదాం



**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలో గల జాఫర్ నిజాం సెమినార్ హాల్ లో డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ నూతన విద్యార్థి సంఘం శనివారం సమావేశమైంది. ఈ సందర్భంగా డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో డీఎస్ఏ సంఘం ఏర్పాటు, సంఘ లక్ష్యాలు, ఆశయాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించికున్న అనంతరం రాష్ట్ర కన్వీనర్ కమిటీనీ ప్రకటించుకున్నారు. ఈ కమిటీలో డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ గా కామగోని శ్రావణ్ (మహబూబాబాద్), రాష్ట్ర కోకన్వీనర్లుగా జిగర అనిల్ (వరంగల్ ), మున్నా గణేష్ (సూర్యాపేట), ఉప్పుల శివ (హనుమకొండ), గుండాల రమేష్ (ఆదిలాబాద్)లను రాష్ట్ర కో-కన్వీనర్ కమిటీగా ప్రకటించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ మాట్లాడుతూ ఏడు దశబ్దాల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించలేని దౌర్భాగ్యమైన స్థితిలో దేశ పాలకులున్నారని, దీనికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం విద్యార్థులుగా మనందరిపై ఉందని వారన్నారు. ఈ కార్యక్రమలో డీఎస్ఏ రాష్ట్ర నాయకలు పవన్, శివ నాగరాజు, అనిల్, శరత్, అభిషేక్, రవికుమార్ పాల్గొన్నారు.

శనివారం 22, జూన్ 2024
www.warangalvoice.net

# అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలి

## పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ఐడీఓసీలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధ్యక్షతన ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మహబూబాబాద్ శాసనసభ సభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మునిసిపల్ చైర్ పర్సన్ డాక్టర్ పాల్వాయి రాంమెహన్ రెడ్డిలతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేక అధికారుల ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజల సమస్యలను పరిష్కరించేలా సమీక్షలు నిర్వహించి, టార్గెట్ లను నిర్దేశించుకొని పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు న్యాయంగా లబ్ధిదారులకు అందేలా, స్మార్ట్ గా ఆలోచించి టెక్నికల్ గా పనిచేయాలన్నారు. నకిలీ విత్తనాలపై దృష్టి సారించి జిల్లాలోని టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని, ఎరువుల, విత్తనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎ జిల్లాలో మహిళా క్యాంటీన్లను ప్రారంభించడానికి అనువైన స్థలాలను గుర్తించాలని అన్నారు. మహిళల ఆర్దికాభివృద్ధికి తోడ్పడేందుకు వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అధికారులు అందించాలన్నారు. ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ గ్రామాలలో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గవర్నమెంట్ దవాఖాన కు వచ్చే రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాలో ట్రాన్స్కో అధికారులు వ్రేలాడే కరెంటు తీగలను సరిచేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ప్రమాదవశాత్తు జరిగే మరణాలను నివారించాలని, నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, డీఎఫ్ఓ బత్తిని విశాల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, జడ్పీ ఇంచార్జి సీఈఓ నర్మద, పంచాయతీరాజ్ ఎస్ఈ సురేష్, వివిధ శాఖల అధికారులు, మండల అధికారులు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కాళోజీ జూనియర్ కళాశాలను మూసివేయాలి

### ఇంటర్ బోర్డ్ అధికారికి బీఎస్ఎఫ్ వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని చింతగట్టులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక బ్రాంచ్ కు అనుమతి పొంది అదనంగా మరో రెండు బ్రాంచ్ లు నడుపుతున్న కాళోజి జూనియర్ కళాశాలను మూసివేయాలని జిల్లా ఇంటర్ బోర్డ్ ఆఫీసర్ గోపాల్ కు తన ఛాంబర్ లో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ కేయూ ఇంచార్జి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహార్ మాట్లాడుతూ రాష్ట్ర ఇంటర్ బోర్డ్ నుంచి ఒకే బ్రాంచ్ పర్మిషన్ అనుమతి తీసుకుని అదనంగా మరో రెండు బ్రాంచ్ నడుపుతున్నారని, కళాశాల లో విద్యార్థుల దగ్గర అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ధోబి, మెడికల్ ఫీజుల పేరుతో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని, అదే విధంగా విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కాబట్టి, వెంటనే కాళోజీ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకొని కాలేజీని మూసివేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సంఘం నాయకులు చెన్నూరి జీవన్, మొకినపెల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు వాక్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకర్గ కేంద్రంలో 20 నెలల క్రితం బలవన్మరాణానికి పాల్పడిన ఉప్పుల సతీష్-స్రవంతి వారి పిల్లలు మాస్టర్ విరాట్, మాస్టర్ విహనల చదువుల నిమిత్తం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు-వాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వన్నాల వెంకట రమణ వాక్ ఫౌండేషన్ నుంచి ఆర్థిక సహాయం అందజేశారు. వారికి 10వ తరగతి పూర్తి చేసే వరకు వాక్ ఫౌండేషన్ సహాయం అందిస్తుందని ఆయన తెలిపారు. నిరుపేద పిల్లల పై చదువుల కోసం ఆర్థికంగా సహాయం అందిస్తూ వారికి ఆసరాగా వాక్ ఫౌండేషన్ నిలుస్తుందని ఈ సందర్భంగా వాక్ ఫౌండేషన్ ఫౌండర్ వన్నాల అరవింద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వన్నాల వెంకట రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్తా, 28వ డివిజన్ మాజీ అధ్యక్షుడు వెనిశెట్టి రోహిత్, మండలోజు జగన్, జెల్లిపల్లి మురళీధర్, పొన్నోజు నాగరాజు, గజ్జెల శ్రవణ్, అప్పుల రాజేష్, మాతోజు సురేందర్, కూచన క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కక్షపూరిత రాజకీయాలు

## జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, అమెరికా :** తెలంగాణలో కక్షపూరిత రాజకీయాలు ప్రారంభించారని జనగాం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఇప్పటిదాకా ఇలాంటి వాతావరణం తెలంగాణలో లేదని, బీఆర్ఎస్ పార్టీ వీడే ప్రసక్తే లేదని పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డికి కూడా తెలుసన్నారు. ఉద్యమం నుంచి రాజకీయాలలోకి వచ్చానని, ఉద్యమంలో అరెస్ట్ అయ్యానని, నేను పార్టీ మారనని ప్రకటించారు. అమెరికాలోని వర్జీనియాలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా పాల్గొని మాట్లాడుతూ రాజకీయాల్లో విలువలు పాటించి, గెలిచిన పార్టీలో ఐదేళ్లు ఉండాలన్నారు. పార్టీ మారాలని నాపై ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నారు. ఆరు నెలల్లో నాలుగైదు కేసులు నమోదయ్యాయి. విచారణ పేరుతో కమిటీలు వేశారు. నాతో పాటు భార్య నీలిమ, కొడుకు అనురాగ్ పై కూడా కేసులు పెట్టారు. వాటికి భయపడనని, ఎదుర్కొంటూ పోరాడతానని తెలిపారు. బీఆర్ఎస్ లోకి రాకముందు జేఏసీతో కలిసి తెలంగాణ కోసం పనిచేశా, అప్పుడు కేసులు నమోదయ్యాయని, మళ్లీ ఇప్పుడు పెడుతున్నారని, నాకు కేసులు కొత్త కాదన్నారు. కాళేశ్వరం అద్భుత ప్రాజెక్ట్ అని, నిపుణుల సలహాతో అక్కడ కట్టారని, కొందరు అవగాహన లేమితో మాట్లాడుతున్నారని పల్లా మండిపడ్డారు. అనేక రిజర్వాయర్ లలో కాళేశ్వరం ఒకటి, అనేక మంది కాంట్రాక్టర్లు ప్రాజెక్టులో నిమగ్నం అయ్యారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి కాంగ్రెస్ వచ్చింది. ఈ విషయం ఇప్పుడిప్పుడే ప్రజలకు అర్థం అవుతుందన్నారు. కేసీఆర్ కు శ్వాస, ధ్యాస తెలంగాణే అని, తెలంగాణ తలెత్తుకొని నిలబడేలా ఆయన చేశారని కొనియాడారు. ఇక్కడి యూనివర్సిటీల నుంచి మనం నేర్చుకోవాల్సింది ఉందన్నారు. మౌలిక సదుపాయాలు, పరిశోదన లాంటి అంశాల్లో ఆదర్శంగా ఉంటాయని తెలిపారు. మన స్టూడెంట్స్ స్ట్రాంగ్, అందుకే 30 శాతం మంది ఇండియా వాళ్లే ఇక్కడ ఉంటారు. అందులోనూ తెలుగు వాళ్లే అధికమని, ఇటు విద్యా,అటు ఉద్యోగం విషయాల్లో మన వాళ్లపైనే విదేశీ యూనివర్సిటీలు ఆధార పడుతున్నాయని, ఇది మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. ఆటా ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా, ఆటా గత ప్రెసిడెంట్ లు భువనేశ్ భుజాల, రామ్మోహన్ కొండ, జీటీఏ చైర్మన్ కలవల విశ్వేశ్వర రెడ్డి, రవి పల్లా, స్థానిక తెలుగు సంఘాలు మీట్ అండ్ గ్రీట్ లో పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేరుస్తూ రైతులకు రెండు లక్షల రూపాయలను ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్నందుకు తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకుగాను రుణమాఫీ చేస్తున్నందుకు రాష్ట్ర మంత్రివర్గానికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తెలంగాణ రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.

## హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపిక పోటీలు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్, ఆదిలాబాద్, ఆర్ఎస్ఎస్ కరీంనగర్ పాఠశాల చేరేందుకు విద్యార్థిని, విద్యార్థులకు ఎంపిక చేస్తున్నామని ఎంఈఓ పూల్ చంద్, మండల స్పోర్ట్స్ డెవలప్ మెంట్ ఆఫీసర్ కె.రవికుమార్ తెలిపారు. జిల్లా యూత్ స్పోర్ట్స్ అథారిటీ మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ సింగ్ ఆదేశానుసారంగా మండలంలో వివిధ పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు తమ తమ పాఠశాలలో బోనఫైడ్ సర్టిఫికెట్ వెంట తీసుకొని ఈ నెల 25న మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ డోర్నకల్ లో నిర్వహించే పోటీలలో పాల్గొనాలని కోరారు. 800 మీటర్స్ పరుగు పందెం, 30 మీటర్ల ఫ్లయింగ్ స్కాడ్, షటిల్ రన్, క్రికెట్ జంప్ పోటీలు నిర్వహించి స్పోర్ట్స్ స్కూల్ కు ఎంపిక చేస్తామని వివరించారు. అర్హత కలిగిన అశవాహులు ఈ అవకాశాలను సద్వినియోగించుకోవాలని కోరారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** డివిజన్‌లోని రహదారుల కిరువైపులా పిచ్చి మొక్కలను, తమ ఇంటి ముందున్న వారు వాటిని తొలగించుకోవడానికి శ్రద్ధ చూపాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఉర్సు సుభాష్ నగర్ లో ముకుంద ఎస్టేట్ సమీపంలో విపరీతంగా పిచ్చి మొక్కలు పెరగడం వలన అందులో పాములు సంచరిస్తున్నాయని, దుర్వాసన వస్తుందని ప్రజలు ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ మరుపల్లి రవి వెంటనే స్పందించి శానిటరీ సిబ్బందితో గ్యాంగ్ వర్క్ ఏర్పాటు చేసి పిచ్చి మొక్కలను గడ్డిని తొలగించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్ల రవితో పాటు జవాన్ ప్రశాంత్, స్థానిక ప్రజలు ఉన్నారు.

## మంత్రులను కలిసిన రాపోలు రామ్మూర్తి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్ర వ్యవసాయ, చేనేతసహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును, అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మరియు సహకార శాఖ మంత్రి నాగేశ్వరరావు ఓఎస్డీని శనివారం వరంగల్ జిల్లా నాయకులు రాపోలు రామ్మూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. కంచనపల్లి గ్రామంలో పీఏసీఎస్ ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అవినీతి గురించి వివరించారు. త్వరితగతిన అవినీతిని వెలికితీసి రైతులు, సంఘ సభ్యుల ఆస్తిని, బ్యాంక్ ను కాపాడాలని కోరారు. అదే విధంగా పలు చేనేత సహకార కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. పై అంశాల గురించి సానుకూలంగా స్పందించి మంత్రులు వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సాధం గట్టయ్య, పరమేశ్వర గౌడ్ పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
శనివారం 22, జూన్ 2024




# సోనాక్షి ఇంట పెళ్లి సందడి

బాలీవుడ్ నటులు సోనాక్షి సిన్హా జహీర్ ఇక్బాల్ పెళ్లి చేసుకోబోతున్నారంటూ ఇటీవల జోరుగా ప్రచారం సాగిన సంగతి తెలిసిందే. ఆ రూమర్స్‌పై ఇద్దరూ ఇప్పటివరకూ స్పందించలేదు. బాలీవుడ్ వర్గాల సమాచారం మేరకు.. సోనాక్షి- ఇక్బాల్‌ల వివాహం ఆదివారం జరగనుందని తెలిసింది. ఈ నేపథ్యంలో ముంబయిలోని సోనాక్షి ఇంట నిర్వహించిన మెహందీ వేడుక ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఆ ఫంక్షన్‌కు ఇరు కుటుంబాలు, కొద్దిమంది అతిథులు హాజరైనట్టు సమాచారం. 'డబుల్ ఎక్స్‌ఎల్' సినిమాలో కలిసి నటించిన ఇక్బాల్, సోనాక్షిల మధ్య స్నేహం ఏర్పడింది. తర్వాత అది ప్రేమగా మారింది. తన కుమార్తె వివాహంపై వచ్చిన వార్తలపై ఇటీవల నటుడు శత్రుఘ్న సిన్హా స్పందించారు. 'ఇది నా ఒక్కగానొక్క కుమార్తె జీవితం. ఆమె అంటే నాకు అమితమైన ప్రేమ. నేనే తన బలం అని ఆమె ఎన్నోసార్లు చెప్పింది. తప్పకుండా తన పెళ్లికి వెళ్తా అని తెలిపారు. అంతకుముందు ఓ సందర్భంలో స్పందిస్తూ.. సోనాక్షి- ఇక్బాల్‌ల ప్రయాణం గురించి తనకేమీ తెలియదనడం గమనార్హం.



# రామోజీలో అనుష్క ఘాటి మూవీ షూటింగ్

కథానాయికా ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు కేరాఫ్ స్వీటీ అనుష్క. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా బలమైన పాత్రలు, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలతో మెప్పించి తెలుగునాట అద్భుతమైన గుర్తింపు పొందారు. గత ఏడాది 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. తాజాగా క్రిష్ దర్శకత్వంలో ఆమె 'ఘాటి' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది.అనుష్క, విక్రమ్ తదితరులపై మార్కెట్ నేపథ్యంలో సాగే పాటను చిత్రీకరిస్తున్నారు. రాజు సుందరం నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. అంతే కాదు కీలక సన్నివేశాల చిత్రీకరణకు కూడా దర్శకుడు ఎ÷-లాన చేస్తున్నారు. ఇటీవలే 'కథనార్..' చిత్రంతో మలయాళంలోకి అడుగుపెట్టింది అనుష్క. ఈ సినిమా కూడా చిత్రీకరణ దశలో ఉంది.



# కల్కిలో రోజుకో సర్‌ప్రైజ్

## తెరమీదకు వచ్చిన మాళవికా నాయర్



కల్కి 2898 ఏడీ' చిత్రంలో పలు అతిథి పాత్రలున్నాయని, ఇంతకుముందు వైజయంతీ నెట్‌వర్క్ చిత్రాల్లో సందడి చేసిన కొందరు ఆ క్యారెక్టర్లు ప్లే చేస్తున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. దీనిపై చిత్ర బృందం ఇప్పటివరకూ స్పందించలేదు. కానీ, 'రిలీజ్ ట్రైలర్' లో ఓ హీరోయిన్‌ను చూపించి అభిమానులను సర్‌ప్రైజ్ చేసింది. ఆమే మాళవిక నాయర్. గతంలో వైజయంతీ నెట్‌వర్క్ బ్యానర్‌లలో తెరకెక్కిన 'ఎవడే సుబ్రహ్మణ్యం', 'మహానటి'లోను ఆమె కీలక పాత్రలు పోషించి, మెప్పించారు. దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ మూడు చిత్రాల్లో ఆమె నటించడం విశేషం. అదే నెట్‌వర్క్‌లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే'లోనూ ఆమె సందడి చేశారు. ట్రైలర్‌లోని తన లుక్‌ని స్క్రీన్‌షాట్ తీసి, అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా మాళవిక ఆనందం వ్యక్తంచేశారు. వాటిని తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేస్తూ థ్యాంక్స్ చెప్పారు. కొన్ని రోజుల క్రితం విడుదలైన తొలి ట్రైలర్ ద్వారా ఈ సినిమాలో అలనాటి హీరోయిన్ శోభన ఉన్నారని తెలిసింది. ఆ తర్వాత చిత్ర బృందం అధికారికంగా ప్రకటిస్తూ ఆమె లుక్‌ని షేర్ చేసింది. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారని రూమర్స్ వచ్చాయి. నాగ్ అశ్విన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఎన్నో సర్‌ప్రైజ్ లుంటాయని తెలిపారు. మరి, ఆయన ఈ రోల్స్ గురించే చెప్పారా, వేరే దాని గురించా? అంటే వేచి చూడాల్సిందే. ప్రభాస్ హీరోగా రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ మూవీలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్ర ప్రసాద్, దీపికా పదుకొణె, దిశా పటానీ కీలక పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే. కాశీ, కాంప్లెక్స్, శంబల అనే మూడు ప్రపంచాల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కిన ఈ సినిమా ఈనెల 27న విడుదల కానుంది.

### కల్కిలో విజయ్ దేవరకొండ కూడా ఉన్నాడా ?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం కల్కి. ఈ సినిమా జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ఇంకా 5 రోజులే ఉండడంతో ప్రమోషన్స్ గట్టిగా చేస్తున్నారు మేకర్స్. ఇప్పటికే టీజర్‌తో పాటు ట్రైలర్‌లు విడుదల చేయగా ఆకట్టుకున్నాయి. ఇదిలావుంటే శుక్రవారం రిలీజ్ ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అయితే ఈ కొత్త ట్రైలర్‌లో మాళవికనాయర్?ను చూపించి సర్?ప్రైజ్ ఇచ్చారు మేకర్స్. ఇప్పుడు తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక సాలిడ్ రూమర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమాలో రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ నటిస్తున్నట్లు తెలుస్తుంది. అశ్వథామ(కుంజరం)ను ఎదుర్కొనే పాత్రలో విజయ్ కనిపించబోతున్నట్లు నెట్టింట వార్తలు వైరల్ అవుతున్నాయి. దీనిపై మేకర్స్ ఎటువంటి క్లారిటీ ఇవ్వలేదు.

### కల్కి ట్రైలర్ చూసి రామ్ ఫిదా

మరో 5 రోజుల్లో ప్రభాస్ కల్కి సందడి మొదలు కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్‌తో పాటు ట్రైలర్‌లు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా మేకర్స్ రిలీజ్ ట్రైలర్ విడుదల చేశారు. ఇక ఈ రిలీజ్ ట్రైలర్‌లో ఓ కొత్తలోకాన్ని ఆవిష్కరించాడు దర్శకుడు నాగ్‌అశ్విన్. ఇప్పటివరకూ వచ్చిన భారతీయ సినిమాలన్నీ ఒకెత్తు.. 'కల్కి 2898' ఒకెత్తు అనేలా ఉంది ఈ కొత్త ట్రైలర్. అయితే ఈ ట్రైలర్ చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఫిదా అవ్వడంతో పాటు ప్రశంసల వర్షం కురిపించాడు. అలాగే నెటిజన్లకు ఈ ట్రైలర్‌పై ఒక టాస్క్‌ను ఇస్తూ.. ఒక పజిల్‌ను పోస్ట్ చేశాడు. ఒక సెంటెన్స్ ఇచ్చి అందులో కొన్ని లెటర్స్‌ను మిస్ చేశాడు. ఈ పజిల్‌ను ఎవరైతే ముందుగా ఫిల్ చేస్తారో వాళ్లకి లక్ష రూపాయలను బహుమతిగా ఇస్తానని చెప్పాడు.







# డ్రగ్స్ పై ఉక్కుపాదం

**పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క**

**జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్షా సమావేశం**



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాష్ట్రంలో డ్రగ్స్ కు బానిసలుగా మారడంతో మహిళలపై అఘాయిత్యాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఎక్కువగా డ్రక్స్ కు అలవాటు పడుతున్నారన్నారు. డ్రగ్స్ ను సమూలంగా అరికట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. మహబూబాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధిపై శనివారం కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధ్యక్షతన మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం అమె విలేఖరులతో మాట్లాడుతూ డ్రగ్స్ తో పాటు అన్ని రకాల మాఫియాను సంపూర్ణంగా అరికడతామని మంత్రి సీతక్క ప్రకటించారు. ఇప్పటికే గంజాయిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు చేపట్టామని ప్రకటించారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. ఆ దిశగానే అడుగులు వేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల నియామకాలను భర్తీ చేస్తామన్నారు. విద్యా శాఖలో జిల్లా వ్యాప్తంగా కేవలం ఇద్దరు ఎంఈఓలు మాత్రమే విధులు నిర్వహించడాన్ని బట్టి గత పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతోందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో విద్యాశాఖ అధ్వానంగా మారిందని ధ్వజమెత్తారు.

### కబ్జాదారులపై చర్యలు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంగా మారిన తర్వాత భూకబ్జాలు పెరిగాయని ఆరోపించారు. భూకబ్జాదారులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. అసంపూర్తిగా ఉన్న వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వందేనని హామీ ఇచ్చారు. వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా ప్రతినిధులతో కలిసి సమన్వయంగా పనిచేయాలని సూచించారు. ఇది తొలి సమావేశం కాబట్టి అధికారులను సున్నితంగా మందలించామని, త్వరలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ , ఎమ్మెల్యేలు డాక్టర్ మురళి నాయక్, డాక్టర్ రామచంద్రు నాయక్, కోరం కనకయ్య, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, మున్సిపల్ చైర్మన్ రాంమోహన్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్**



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ శనివారం ఎస్టీ కేసులపై సమీక్ష జరిపారు. ఉదయం పోలీస్ కమిషనర్ రేట్ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి పుష్పాగుచ్ఛం అందించి సాధరంగా ఆహ్వానించారు. అనంతరం కమిషన్ సభ్యులు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెండింగ్ లో ఉన్న ఎస్సీ కేసుల వివరాలతో పాటు, బాధితులకు అందజేయాల్సిన నష్టపరిహారానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో బాటు బాధితులకు సత్వరమే నష్టపరిహారాన్ని అందజేసే విధంగా అధికారులు చొరవ చూపాలని హుస్సేన్ నాయక్ అదనపు డీసీపీకి సూచించారు.



# ఆరు గ్యారెంటీలకు సవరణలు

**కార్పొరేటర్ మరుపల్ల రవి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలలో దరఖాస్తు చేసి అర్హత పొందని వారు తిరిగి వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న ఇంటి యజమానులకు ఇప్పటి వరకు గ్యాస్ కనెక్షన్ సబ్సిడీ పడనివారు ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత కలిగిన ఇంటి యజమాలకు కరెంట్ జీరో బిల్లు రానివారు ఉర్సులోని సీఆర్ సీ సెంటర్ లో సరైన ఆధారాల జిరాక్స్ చూపించి సరిచేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మరుపల్ల రవి సూచించారు.

**- వరంగల్ వాయిస్, కరీమాబాద్**



# గడ్డం సమ్మయ్యకు సన్మానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చిందు యక్షగాన కళాకారుడు పద్మ శ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను శనివారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘనంగా సన్మానించారు. శనివారం హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని కడియం శ్రీహరి, కడియం కావ్య నివాసంలో గడ్డం సమ్మయ్య వారిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ నివాసానికి వచ్చిన సమ్మయ్యను కడియం కావ్య శాలువాతో సత్కరించారు. గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు రావడం జనగామ జిల్లాకే గర్వకారణమన్నారు. ఆయనకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాడిపెల్లి ప్రేమలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# యోగాలో వరల్డ్ రికార్డ్

**న్యాయవాది శామంతుల శ్రీనివాస్**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా జూన్ 21న ప్రపంచ యోగ ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా హ్యాబిల్డ్ యోగ అనే స్వచ్ఛంద సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఒకే రోజు లక్షలాది మందితో యోగ కార్యక్రమం నిర్వహించి వరల్డ్ రికార్డు సాధించింది. ఈ కార్యక్రమంలో భాగంగా వరంగల్ శివనగర్ కు చెందిన న్యాయవాది, కాంగ్రెస్ నాయకులు, సామజిక వేత్త శామంతుల శ్రీనివాస్ కు ఆన్లైన్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ అందచేశారు. ఈ సందర్భంగా శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ, యోగ ప్రతి వ్యక్తి జీవితంలో భాగం కావాలన్నారు. తద్వారా మానసిక ప్రశాంతత, అరోగ్యం, సామజిక స్పృహ కలుగుతందన్నారు. ఈ సందర్భంగా యోగ గురువులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రత్యేక గ్రీవెన్స్‌కు 15 దరఖాస్తులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు శనివారం దివ్యాంగులు, వయోవృద్దులకు ప్రత్యేక ప్రజవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ గ్రీవెన్స్ లో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి మధురిమ పాల్గొని దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 15 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో ఐదు అర్జీలు ఉపాధి కల్పన శాఖకు సంబంధించినవి, మూడు డీఆర్డీఓ, మరో మూడు సంక్షేమ శాఖ, రెండు పోలీస్ శాఖ, ఒకటి ఎస్సీ కార్పొరేషన్, మరోకటి జీడబ్ల్యూ ఎంసీకి సంబందించనవి ఉన్నట్లు వారు ప్రకటించారు. వాటిని ఆయా శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా అడిషనల్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, వృద్దులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com